ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 26.0

జలకళ..



వర్షాలకు నిండుకుండల్లా జలాశయాలు

జిల్లాలోని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లోని జలాశయాలన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరడంతో నిండు కుండలను తలపిస్తున్నాయి. అయా జలాశయాల్లో నీటిమట్టం గరిష్ఠ స్థాయిలకు చేరుకోవడంతో ఇరిగేషన్ అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సార్వా సీజన్‌లో ఎటువంటి సాగునీటి కొరత ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు రైతులు కూడా జలాశయాలు పూర్తి స్థాయిలో నిండడంతో సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జంగారెడ్డిగూడెం/ పోలవరం/బుట్టాయగూడెం/ చింతలపూడి

గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం

బుట్టాయగూడెం మండలం ఏజెన్సీ అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం వరద నీటితో కళకళలాడుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 215.25 ఎంటీఎస్‌గా ఉంది. గతేడాది ఇదే సమయానికి జలాశయంలో నీటిమట్టం 215.60 ఎంటీఎస్‌గా ఉంది. ప్రస్తుతం జలాశయంలోని వాగుల ద్వారా 200 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా అంతే మొత్తంలో గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ తులసి తెలిపారు.





కొవ్వాడ రిజర్వాయర్

పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్ ఇటీవల కురిసిన వర్షాలకు కొండవాగుల జలాలతో నిండుకుండను తలపిస్తోంది. రిజర్వాయర్ వద్ద నీటిమట్టం 89.50 మీటర్లకు చేరుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 120 క్యూసెక్కుల జలాలను శనివారం దిగువ కు విడుదల చేసినట్టు రిజర్వాయర్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీరు రాహుల్ భాస్కర్ తెలిపారు. గతేడాది ఇదే రోజున 88.07 మీటర్ల నీటిమట్టం నమోదైంది. వర్షాలు లేని కారణంగా నీటి నిల్వలు లేక కుడి కాల్వకు 20 క్యూసె క్కులు, ఎడమ కాల్వకు ఏడు క్యూసెక్కుల జలాలు మాత్రమే విడుదల చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటిమట్టం 89.50 మీటర్లు ఉండగా 0.03 టీఎంసీలు నిల్వ ఉండ డంతో ఈ ఏడాది మొదటి పంటకు ఇబ్బందులు ఉండ వని రిజర్వాయర్ సిబ్బంది సత్యనారాయణ తెలిపారు.

ఎర్రకాల్వ జలాశయం

జంగారెడ్డిగూడెం మండలంలోని ఎర్రకాల్వ జలాశయంలోనికి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. శనివారం 500 క్యూసెక్కుల వర్షపు నీరు జలాశయంలోకి చేరుతుండగా 860 క్యూసెక్కుల నీటిని ఒక గేటుద్వారా దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు నీటిమట్టం 83.50 కాగా ప్రస్తుతం 81.90 మీటర్లు ఉన్నట్లు డీఈ రాంబాబు తెలిపారు. గత సంవత్సరం ఇదే రోజు ఎర్రకాల్వ జలాశయంలో నీటిమట్టం 81.35 ఉంది. 100 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుకోగా 100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు తెలిపారు.

పోగొండ జలాశయం



బుట్టాయగూడెం మండలం భైనేరు కొండవాగుపై చింతలగూడెం- నిమ్మలగూడెం గ్రామాల మధ్య నిర్మించిన పోగొండ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. జలాశయం పూర్తిగా నిండిపోవడంతో సర్‌ప్లస్ చానల్ ద్వారా వరదనీరు బయటకు పోతుంది. జలాశయం పూర్తి నీటిమట్టం 218 ఎంసీఎఫ్‌టీ అని ఇరిగేషన్ ఏఈ తులసి తెలిపారు. ఏజెన్సీలో జలాశయాలు నిండటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తమ్మిలేరు రిజర్వాయర్



చింతలపూడి సమీపంలో నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్ నీటిమట్టం గత ఏడాది కంటే ఈ ఏడాది అదనపు నీరు విడుదల చేయడంతో తమ్మిలేరుకు జలకళ వచ్చింది. గత ఏడాది 3వ తేదీ నాటికి 347.44 నీటిమట్టం ఉండగా, ఈ ఏడాది జూలై 31వ తేదీకి 350.50 నీటిమట్టం చేరింది. ఇది కాక గత నాలుగు రోజులుగా దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో శనివారం 348.06 చేరింది. ఇంకా దిగువకు నీరు విడుదల చేస్తూనే ఉన్నారు. అంతేకాక మూడు కాల్వల ద్వారా రైతులకు సాగునీరు ఇస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 355 అడుగులు కాగా 3వ తేదీ నాటికి 1.900 టీఎంసీల నీరు ఉంది.



ఆచంట మండలం కోడేరు వద్ద తగ్గిన గోదావరి

గోదావరి వరద తగ్గింది..

కుక్కునూరు/ వేలేరుపాడు/ పోలవరం/ఆచంట/ నర సాపురం రూరల్, ఆగస్టు 3: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ముంపు బారిన పడిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలు కొద్దికొద్దిగా తేరుకుంటున్నాయి. నీట మునిగిన రోడ్లు బయట పడుతున్నాయి. మరోవైపు పంట పొలాలు నీట మునగడంతో వ్యవసాయ పనులు లేక ఉపాధి కరు వైందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం క్రమ క్రమంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,70,355 క్యూసెక్కుల జలాల ను దిగువకు విడుదల చేశారు. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు వరద నీటి నుంచి బయటపడ డంతో ఏటిగట్టుకి కుడివైపున పంటపొలాల్లో ఉన్న వరద జలాలు వేగంగా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి.
- ఆచంట మండలంలో వశిష్ఠ గోదావరి ఉధృతి శనివారం నాటికి మరింత తగ్గడంతో మండలంలో ఉన్న కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, పుష్కరఘాట్ రేవులు బయటపడుతున్నాయి. రేవులు మట్టితో కప్పబడి దర్శ నమిస్తున్నాయి. గోదారి ఉధృతి బాగా తగ్గడంతో లంక వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంకా లంక గ్రామాల్లో శానిటేషన్ పనులు , మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు.

పంటుకు గ్రీన్ సిగ్నల్..

వరద కారణంగా గత పది రోజుల నుంచి వశిష్ఠ గోదావరిలో నిలిచిన పంటు, పడవల రాకపోకల్ని సోమవారం నుంచి పునరుద్ధరించనున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో జిల్లా అధికారులు రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు నరసాపురం- సఖినేటిపల్లి రేవుల మధ్య పంటు తిరుగుతుందన్నారు. మరోవైపు మూడు రోజులుగా ఎండలు కాస్తుండడంతో రేవుల్లో బురద ఎండిపోవడంతో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. ఇప్పటికే మండల పరిషత్ అధికారులు రెండు పంటులను పరిశీలించారు. సాంకేతికంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 3: జిల్లాలో వర్షాలు కొనసాగు తూనే ఉన్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధి కంగా పోలవరం మండలంలో 28.2 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 2.1 మి.మీ నమోదైంది. వేలేరుపాడులో 19.6, కుక్కునూరులో 8, బుట్టాయిగూడెంలో 2.2, జంగారెడ్డిగూడెంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరి , పత్తి, మొక్కజొన్న పంటలు ఇంకా నీటి ముంపులోనే ఉన్నాయి.

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, ఆగస్టు 3: జిల్లాలో పేదల గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి గృహనిర్మాణ శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో పేదల గృహనిర్మాణ పనులపై కలెక్టరేట్ నుంచి మండల స్థాయిలోని గృహనిర్మాణ శాఖ సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. 'జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ , గ్రామీణ పథకాల కింద లక్షా 3వేల 264 ఇళ్లను పేదలకు మంజూ రు చేయగా 36వేల 480 ఇళ్లు పూర్తయ్యాయి. 45వేల 703 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 21వేల 806 ఇళ్ళు ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా రోజుకు 337 ఇళ్లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న దశ నుంచి తదుపరి దశకు తీసుకువెళ్లాలి. రోజుకు 41 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేలా మండలాల వారీగా లక్ష్యాలను నిర్ణయించాం. ఇళ్ళ నిర్మాణ ప్రగతిని ప్రతి రోజు సమీక్షిస్తాను. లక్ష్య సాధనలో వెనుకబడిన అధికారులు , సిబ్బందిపై చర్యలుంటాయి' అంటూ కలెక్టర్ హెచ్చరించారు. హౌసింగ్ పీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఈఈలు జి.రామకృష్ణ, డి.రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో మూడో విడత అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : జిల్లాలోని ఐదు ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో మిగిలివున్న సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్టు ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్/అడ్మిషన్ల కన్వీనర్ పి.రజిత ఓ ప్రకటన లో తెలిపారు. విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను ఈ నెల 26వ తేదీలోగా సమర్పించాలన్నారు. దర ఖాస్తు కాపీ ప్రింటవుట్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థి ఎంచుకున్న ఐటీఐలో 27వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులను మాత్రమే కౌన్సెలింగ్‌కు అనుమతి స్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐటీఐలలో అడ్మిషన్లకు ఈ నెల 28న, ప్రైవేటు ఐటీఐలకు 31న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.

ఉద్యాన పంటల అభివృద్ధికి పథకాల అమలు

- జిల్లా ఉద్యాన శాఖాధికారి రామ్మోహన్

ఏలూరుసిటీ, ఆగస్టు 3: జిల్లా పరిధిలో 2024-25 సంవత్సరంలో ఉద్యాన పంటల రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందని జిల్లా ఉద్యాన శాఖాధికారి రామ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరంలో (2024-25) ఉద్యాన పంటల అభివృద్ధి కోసం జిల్లాలో జాతీయ వంట నూనెల మిషన్ - ఆయిల్ పామ్ , సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన , కొబ్బరి అభివృద్ధి బోర్డు పథకాలు అమలులో ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్ పథకం కింద మొక్కకు రూ. 193, చొప్పున హెక్టారుకు రూ. 29,000 ప్రభుత్వ రాయితీ ఇస్తారన్నారు. మామిడికి రూ.7,980, కోకో రూ. 12,000, జీడిమామిడి రూ. 12000, బత్తాయి/ నిమ్మ రూ. 9,620, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ. 30,000, కూరగాయాలు రూ. 20,000, ప్లాస్టిక్ మల్చింగ్ కవర్లు రూ. 16,000 , ఆర్‌కేవీవైలో పందిర్ల సాగుకు రూ. 2,0000 రాయితీ ఇస్తారన్నారు. ఉద్యాన రైతులు రైతు సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతేడాది రైతులకు రావాల్సిన రాయితీలను దశల వారీగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు.

గంజాయిని అరికట్టేందుకు నార్కోటిక్ సెల్

- గంజాయి అమ్మినా, కొన్నా శిక్షార్హులు : ఎస్పీ

కైకలూరు, ఆగస్టు 3: జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు నార్కోటిక్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. శనివారం రాత్రి కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎక్కడ గంజాయి తాగుతున్నట్లు తెలిసినా ప్రజలు తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని అప్పుడే గంజాయి అరికట్టడంలో సఫలమవుతామని అన్నారు. సమాచారం ఇచ్చిన వివరాలను గోప్యంగా ఉంచబడతా యన్నారు. ప్రభుత్వం 100రోజుల యాక్షన్ ప్లాన్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా గంజాయి తనిఖీలు నిరహిస్తున్నామని యువత గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, మైనర్లు ఎవ్వరూ గంజాయి కేసులో దొరికిన తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. గంజాయి విక్రయించినా, తాగినా చట్టరీత్యా కఠిన శిక్షలను వేయడం జరుగుతుందని హెచ్చరించారు. గంజాయి చిన్నవ్యాపారం చేసినా పెద్ద శిక్షలు ఉంటాయని కైకలూరులో ఇటీవల నలుగురిని అరెస్టు చేశామని వారు ప్రస్తుతం జైలులో ఉన్నట్లు వెల్లడించారు. గంజాయిని అరికట్టేందుకు షార్ట్‌ఫిల్మ్ ద్వారా, కళాశాలలు, పాఠశాలల్లో పెద్దఎత్తు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే గంజాయి తాగుతున్న వారి వివరాలు సేకరించి వారికి కౌన్సెలింగ్ చేస్తామని అన్నారు. అలాగే సైబర్ క్రైం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖాతాలో డబ్బులు పోయిన వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై టిరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కైకలూరులో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

విద్యార్థుల సంఖ్యే టీచర్ల.. పని సర్దుబాటుకు ప్రామాణికం

తనిఖీల్లో అనైతిక పద్ధతులు రుజువైతే ఎంఈవో, హెచ్‌ఎంల సస్పెన్షన్
వెబెక్స్ సమావేశంలో పాఠశాల విద్య ఉన్నతాధికారులు

కానిస్టేబుల్‌పై చీటింగ్ కేసు నమోదు

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

7

శ్రీరస్తు... శుభమస్తు !



- మూడు నెలల విరామం తరువాత మోగనున్న పెళ్లి బాజాలు
- ఈనెల 25 వరకు ముహూర్తాలు

నరసాపురం, ఆగస్టు 3: మెడలో కళ్యాణమాల వేసుకోవాలని, కొత్త ఇంటిలోకి వెళ్లాలని, ఇళ్లు కట్టుకునేందుకు శంకుస్థాపన కోసం, ఉపనయాలకు మంచి ముహూర్తాల కోసం ఎదురు చూస్తున్న వారి కల నేరవేరనుంది. సోమవారం నుంచి శ్రావణ మాసం..శుభకార్యక్రమాలకు మంచి మాసం, ఎక్కువ మంది వివాహాలు ఈ మాసంలోనే జరుపుకోవడం జరుగుతుంది. దీంతో మూడు నెలలు నుంచి మూఢం, శూన్యమాసాలు కారణంగా ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా శుభకార్యక్రమాలకు బ్రేక్ పడ్డాయి. మండపాలన్నీ మూతపడ్డాయి. పండితులు, కేటరింగ్, పూలడేకరేషన్ వంటి వ్యాపారులకు ఉపాధి కరువైంది. మళ్లీ వీరందరూ బీజీ కానున్నారు. ఈనెల 7 నుంచి 25 వరకు దాదాపు 14 మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ శుభఘడియల్లో ఉమ్మడి పశ్చిమ వ్యాప్తంగా వేల సంఖ్యలో వివాహాలు జరగను న్నాయి. అలాగే గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయాలు, తాంబూలాలు జరగనున్నాయి. ఇప్పటికే చాలా మంది మండపాలను బుక్ చేసుకున్నారు. ఈ ఒక్క నెలలోనే ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 8 వేలకు పైగా వివాహాలు జరగనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన వందల కోట్ల వ్యాపారం జరగనుంది. మరోవైపు ఈ శుభ కార్యక్రమాలకు వచ్చేందుకు దూర ప్రాంతాల్లో ఉన్న వారంతా సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే టిక్కెట్లు బుక్ చేసుకున్నారు.

ఈనెల 7 నుంచి ముహూర్తాలు

ఈ శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు 7, 8, 9, 10, 13, 15, 17, 18, 19, 22, 23, 24 తేదీల్లో ఉన్నాయి. దాదాపు మూడు నెలల తరువాత ముహూర్తాలు ఉండటంతో ఈ మంచి గడియల్లో పెళ్లిళ్లు చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధం అవుతున్నారు. తాంబూలాలు కూడా ఈ ముహూర్తాల్లోనే చాలామంది పెట్టుకుంటున్నారు. గృహ ప్రవేశాలను కూడా ఈ ముహూర్తాలకే ఎంచుకున్నారు. దీంతో మంచి ముహూర్తాల్లో వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఇప్పటికే కళ్యాణ మండపాలన్నీ బుక్ అయ్యాయి. వర్షాకాలం కావడంతో చాలా మంది ముందుగానే రిజర్వు చేసుకున్నారు. వచ్చే బంధువుల కోసం అడ్వాన్స్‌గా లాడ్జీలు కూడా బుక్‌చేశారు. ఈకారణంగా ఏలూరు, నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తణుకు, టీపీగూడెం వంటి పట్టణాల్లోని ముఖ్యమైన లాడ్జీలన్ని నిండుకున్నాయి. కేటరింగ్, పూల డెకరేషన్, పండితులు, వంట మనుషులు, ఫొటోగ్రాఫర్లు, లైటింగ్, సౌండ్ సిస్టమ్, బాజా భజంత్రీలు వాయించే వారు కూడా బుక్ అయిపోయారు. దీంతో మండపాలు దొరకని వారంతా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూసుకుంటున్నారు.

రేపటి నుంచి శ్రావణ సందడి



కోట్లలో వ్యాపారం

గత పదేళ్ళ నుంచి పెళ్లిళ్ళ ట్రెండ్ మారింది. ఖర్చుకు వెనకాడటం లేదు. ఊరేగింపు, మెహంది, వీడియో షూటింగ్, లైటింగ్, భోజనాలు, బంగారం, బట్టల కొనుగోలుకు పెద్ద ఎత్తున ఖర్చు పెడుతున్నారు. కొన్ని వివాహాల ఖర్చు కోట్లకు కూడా చేరు తుంది. భోజనాల్లో 20 నుంచి 30 రకాల వంటలను కూడా వడ్డిస్తున్నారు. ఇక బంగారం కొనుగోలులో రాజీ అవ్వడం లేదు. ఈలెక్కన ఈశ్రావణ మాసంలో జరిగే పెళ్లిళ్ళ ఖర్చు కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే ఎక్కువ ఖర్చు బంగారానికే అవుతుంది.

రైళ్ళ టిక్కెట్లు ఫుల్..

ముహూర్తాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో ఉమ్మడి పశ్చిమ జిల్లా మీదుగా నడిచే రైళ్లన్ని అప్పుడే నిండుకున్నాయి. హైదరా బాద్, బెంగళూరు, చెన్నై, విశాఖ నుంచి వచ్చే రైళ్ళకే ఎక్కువ డిమాండ్ ఉంది. ఎక్కువ మంది రానుపోను టిక్కెట్లను అడ్వా న్స్‌గా బుక్ చేసుకున్నారు. ఇటు కళ్యాణమండపాలు, లాడ్జీల పరిస్థితి కూడా ఇదే రీతిలో ఉంది. మళ్లీ సెప్టెంబర్‌లో శూన్య మాసం, భాద్రపదం మాసం కావడంతో ముహూర్తాలు లేవు, దీంతో ఎక్కువ మంది ఆగస్టులోనే పెట్టుకోవడంతో అన్ని నిండుకున్నాయి.



స్కౌట్స్ యూనిట్ ఏర్పాటు చేయండి : డీఈవో



ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ అమల వుతున్న 150 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు స్కౌట్స్ కార్యకలాపాలపై ఒక రోజు ఓరియంటేషన్ క్లాసులు శనివారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో జరిగాయి. డీఈవో అబ్రహం మాట్లాడుతూ సౌట్స్ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు లభించే సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పాఠశాలలోను స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించేందుకు స్కూల్ హెచ్ఎంలు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. స్కౌట్స్ జిల్లా కార్యదర్శి భాస్కర్ కుమార్, హెచ్ఎం కుటుంబరావు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండాలి

ఏలూరు సిటీ, ఆగస్టు 3: ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు పాఠశాలలకు నూటికి నూరు శాతం హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు ఒక ప్రణాళిక ప్రకారం వెళ్ళాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పేర్కొన్నారు. ఏలూరు జడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. బడి మానివేసిన వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి తల్లి తండ్రులకు చదువు గొప్పతనాన్ని తెలిపి విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో రోజువారీ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు అందాయా లేదా అని తెలుసుకుని పాఠ్యపుస్తకాలు కొరత లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో డీఈఓ అబ్రహం, జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈవో ఎస్ నిర్మలా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతేజం పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల పట్టణాలు, గ్రామాల్లో ఉన్న ఉపాధ్యాయులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారిని సేవాభారతి, తెలుగుతేజం జాతీయస్థాయి పురస్కారాలతో గౌరవించేందుకు నిర్ణయించినట్టు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత రంగాల్లో సేవలందించేవారు ప్రతి భావంతులు పురస్కారాల ఎంపిక నిమిత్తం వారి సేవలు, ప్రతిభను తెలియ జేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్‌ల జిరాక్స్ కాపీలను జతచేసి ఈ నెల 10వ తేదీలోగా 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15' చిరునామాకు దరఖాస్తును పంపాలని సూచించారు. ఎంపికైనవారికి ఈ నెల 18న హైదరాబాద్‌లో పురస్కారాలను అందజేస్తామన్నారు. వివరాలకు ఫోన్ నెంబరు 96523 47207లో సంప్రదించాలని కోరారు.



ఫిర్యాదులు నమోదు చేస్తున్న పల్లా, బండారు మాధవ నాయుడు

టీడీపీ కేంద్ర కార్యాలయానికి వినతుల వెల్లువ

భీమవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజలు, కార్యకర్తల నుంచి పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు వినతులు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పాల్గొన్నారు. వైసీపీ బాధితులైన పలువురు తమకు న్యాయం చేయాలని పార్టీ అధ్యక్షుడిని వేడుకున్నారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగతావి ఆ శాఖల అధికారులకు పంపించారు. రాజధాని నిర్మాణానికి, అన్న క్యాంటీన్ల కోసం దాతలు తమ విరాళాలు నేరుగా ముఖ్యమంత్రికి అందజేశారు. అనంతరం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు.



రగులుతోంది మొగలి పొద..

ద్వారకాతిరుమల, ఆగస్టు 3: ఓ వరి పొలంలో తాచు, జెర్రిగొడ్డు మసకలాడుకోవడాన్ని అక్కడి రైతులు తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు. పాముల మసకలాట గురించి చెప్పుకోవడమే కాని స్వయంగా చూసేవారు అరుదుగా ఉంటారు. ఈ దృశ్యం మండలంలోని హెచ్. లింగపాలెం పౌల్ట్రీ వద్ద ఉన్న ఓ పొలంలో శనివారం మధ్యాహ్నం రైతుల కంటపడింది. ఈ రెండు పాములు పెనవేసుకుని రెండు గంటల పాటు ఇలాగే ఉన్నాయని... చాలా మంది రైతులు వాటిని ఫొటోలు తీసినట్లు చెప్పారు.

వరిపొలంలో తాచు, జెర్రిగొడ్డు మసకలాట దృశ్యం

పని సర్దుబాటుకు ప్రామాణికం

విద్యార్థుల సంఖ్యే టీచర్ల..

తనిఖీల్లో అనైతిక పద్ధతులు రుజువైతే

ఎంఈవో, హెచ్‌ఎంల సస్పెన్షన్

ఎస్ఎంసీ ఎన్నికలు ముగిసేవరకు టీచర్లకు సెలవుల్లేవ్

వెబెక్స్ సమావేశంలో పాఠశాల విద్య ఉన్నతాధికారులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : టీచరు పోస్టులను కాపాడుకోవడానికి కాన్వెంట్ల నుంచి బాలబాలికల పేర్లను కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పడాన్ని సహించబోమని, ఇటువంటి అనైతిక పద్ధతులను అనుసరించే స్కూళ్లను గుర్తించేందుకు త్వరలో సెక్టోరల్ అధికారులు, ప్రభుత్వేతర సంస్థ (ఎన్జీవో)లతో క్షేత్రస్థాయి తనిఖీలను నిర్వహించనున్నట్టు శనివారం డీఈవోలు, ఎంఈవోలతో పాఠశాల విద్య ఉన్నతాధికారులు నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో వెల్లడించారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తదితరు లు నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. ప్రధానంగా టీచర్ల కొరతను అధిగమించేందుకు చేపట్టనున్న పని సర్దుబాటు (వర్క్ అడ్జస్టమెంట్) ప్రక్రియకు ఈ నెల 4వ తేదీని కటాఫ్‌గా తీసుకుని, పాఠశాలలో భౌతికంగా ఉన్న విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులను ప్రామాణికం ఆధారంగా వర్క్ అడ్జస్టమెంట్‌ను నిర్వహిస్తామని ప్రకటించారు. తమ వద్ద ఉన్న యూడైస్ రోల్‌కు, పాఠశాలలో బాలబాలికల ఫిజికల్ రోల్‌కు తేడా ఉన్నట్టుగా సెక్టోరల్ అధికారులు, ఎన్జీవోలు నిర్ధారణ చేస్తే సంబంధిత ఎంఈవో, స్కూలు హెచ్‌ఎంలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అయితే కీలకమైన జీవో 117 మార్గదర్శకాల మేరకే విద్యార్థులు, ఉపాధ్యాయుడు నిష్పత్తిని నిర్వహిస్తారా లేక మరేదైనా ఫార్ములాను పాటించాలా అనే విషయంపై ఉన్నతాధికారులు సమావేశంలో నేరుగా స్పష్టతనివ్వకపోవడం గమనార్హం. హేతుబద్ధీకరణ అనంతరం పాఠశాలలో అవసరానికి మించి ఉన్న మిగులు (సర్‌ప్లస్) టీచర్లను తొలుత సంబంధిత మండల పరిధిలో, ఆ తర్వాత సమీప మండలాల్లో కొరత ఉన్న పాఠశాలలకు తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తామని వివరించారు. ఆ ప్రకారం చూస్తే జిల్లాలో ఇప్పటికే ప్రతి మండలంలో సగటున 15 నుంచి 40 మంది వరకు ఎస్జీటీలు, ప్రతి హైస్కూలులో 3 నుంచి ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్‌గా ఉన్నట్టు ప్రాథమికంగా తేలింది. ఇక లెసన్ ప్లాన్‌లను ఉపాధ్యాయులందరూ అప్‌డేట్‌గా ఉంచుకోవాలని, వచ్చే వారం నుంచి విద్యాశాఖమంత్రి, పాఠశాల విద్య కార్యదర్శి, కమిషనర్‌లు ముందుగా సమాచారం ఇచ్చిన తర్వాతే తనిఖీలకు వస్తామని వెల్లడించారు. ఉపాధ్యాయులు ఇక మీదట పాఠశాలల్లో టాయిలెట్లను ఫోటోలు తీయడం ఐచ్ఛికమే తప్ప, తప్పనిసరికాదని తేల్చి చెప్పారు. ఆదివారం సాయంత్రంలోగా టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం(టిస్) డేటాలో తప్పులుంటే ఎడిట్ ఆప్షన్‌లో సవరించుకోవాలని ఆదేశించారు. సెకండ్ మెథడాలజీ ఆధారంగా ఎస్జీటీలను హైస్కూళ్ళలో నియమించడంతోపాటు, పదోన్నతులకు కూడా ప్రామాణికంగా తీసుకుంటామని పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లకు ఈ నెల 8న ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా అవి ముగిసేవరకు టీచర్లకు సాధారణ సెలవుల(సీఎల్)తో సహా ఎటువంటి సెలవులు మంజూరు చేయరాదని ఆదేశించారు. పాఠశాలల విజిట్ లకు వెళ్ళే డీఈవోలు, ఎంఈవోలు తమ పరిశీలనలు, రిమార్క్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే అధికారికంగా తనిఖీలు చేసినట్టుగా పరిగణిస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. పాఠశాలల్లో పది మందిలోపు విద్యార్థులున్న వాటిని గుర్తించి సంబంధిత స్కూళ్ళలో విద్యార్థులను పెంచేలా కృషి చేయాలని, ఒకవేళ పిల్లల సంఖ్య పెరిగే అవకాశం లేకపోతే వాటిపై తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు.

తమ భార్యలను కాపురానికి పంపాలని దీక్షలు



కలెక్టరేట్ వద్ద తోడల్లుళ్ళ దీక్ష

ఏలూరు రూరల్, ఆగస్టు 3: తమ భార్యలను కాపురానికి పంపకుండా తిరిగి తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్న మామ టీకే శ్రీనివాస రామానుజ అయ్యంగార్‌పై చర్యలు తీసుకుని తమ భార్యలను కాపురానికి పంపించాలంటూ ఇద్దరు తోడల్లుళ్ళు కలెక్టరేట్ వద్ద శనివారం దీక్ష చేపట్టారు. తోడల్లుళ్ళు వంగిపురం పవన్, శేషసాయి మాట్లాడుతూ తమ భార్యలను కాపురాలకు పంపకుండా తమ మామగారు అయ్యంగార్ తమపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇటీవల ఉన్నతాధికారులను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయగా, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో న్యాయం కోసం దీక్షలు చేపట్టినట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ క్రీడా పోటీలు

భీమవరం క్రైం, ఆగస్టు 3 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం చెస్, క్యారెమ్స్, షటిల్ పోటీలు డీఎన్నార్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. డబుల్స్ విభాగంలో బండి ఫణి, చంద్రశేఖర్ వంశీ విన్నర్స్‌గా, తరుణ్, శివాజీరాజులు రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్స్ విభాగంలో తరుణ్ విన్నర్‌గాను, బాలాజీ రన్నర్‌గా, సీనియర్ విభాగంలో సాయిశరణ్ విన్నర్‌గాను, మేక శివప్రసాద్ రన్నర్‌గా నిలిచారు. మహిళా విభాగంలో రాధ విన్నర్, అమూల్య రన్నర్‌గా సీనియర్స్ విభాగంలో రాధ, కీర్తి విన్నర్‌గా భాగ్యశ్రీ, శ్యామల రన్నర్‌గా నిలిచారు. స్పోర్ట్స్ కార్యదర్శి హరి మాట్లాడుతూ విజేతలకు ఆగస్టు 15న జడ్జిల చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ టి. శ్రీనివాస్

ముంపు ప్రాంతాల్లో పీఆర్-126 సాగుకు మొగ్గు

పెనుమంట్ర, ఆగస్టు 3 : వరి పొలాలు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులు పీఆర్-126 రకం సాగుకు మొగ్గుచూపుతున్నారని, అటువంటి ప్రాంతాల్లో బాక్టీరియా, ఆకు ఎండు తెగులుపై అవగాహన కల్పించాలని మార్టేరు ఏడీఆర్ డాక్టర్ టి. శ్రీనివాస్ కోరారు. శనివారం మార్టేరులో నిర్వహించిన టీఎన్‌వీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొటాష్ వాడకం పెంచవలసిన ఆవశ్యకత ఉన్నదని, దీనివల్ల పంటకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు జిల్లాలో పంటలు, వాతావరణ పరిస్థితులపై వివరించారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రాయితీపై స్వల్పకాలిక రకాలను అందించడానికి సిబ్బందిని సమాయత్తం చేశామని తెలిపారు. వ్యవసాయ అధికారులకు వివిధ వరి నాటు పద్ధతుల్లో వాడవలసిన ఎరువుల మోతాదుపై అవగాహన కల్పించవలసిన అవసరం శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఆరుతడి పద్ధతిలో వరి పండించే పరిజ్ఞానాన్ని పొలంబడిలో ప్రవేశపెట్టాలని ఆయన సమావేశంలో తెలిపారు. వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న పొలం బడి కార్యక్రమంలో తప్పనిసరిగా శాస్త్రవేత్తలు హాజరు కావాలని కోరారు. అంతేకాక వ్యవసాయ శాఖ సమన్వయంతో వివిధ మండలాల్లో పర్యటించి రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమానికి ప్రధాన శాస్త్రవేత్త డా.ఎం.వి.కృష్ణాజీ, సమన్వయకర్తగా వ్యవహరించగా పలువురు శాస్త్రవేత్తలు తమ సూచనలు తెలిపారు.



ధర్నా చేస్తున్న గొల్లలకోడేరు పంచాయతీ కార్మికులు

జీతాలివ్వలేదని పంచాయతీ కార్మికుల ధర్నా

పాలకోడేరు, ఆగస్టు 3: జీతాలివ్వాలంటూ పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు శనివారం ధర్నా చేపట్టారు. గొల్లలకోడేరు పంచాయతీ కార్యాలయంలో కొందరు యువకులు గతేడాది కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసేందుకు తక్కువకు టెండర్లకు వేసి విధుల్లో చేరి జీతాలు సరిపోవడంలేదని కొద్దిరోజులకే మానేశారు. దీంతో వార్డుసభ్యుల తీర్మానం మేరకు కొత్తవారికి పంచాయతీలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించారు. ప్రస్తుత పంచాయతీ పాలకపక్షం పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు కొంత కాలంగా జీతాలివ్వడంలేదు. దీంతో వారు జీతాలు ఇవ్వాలని పంచాయతీ కార్యాలయం ముందు శనివారం ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా వార్డు సభ్యులు సైతం ధర్నాలో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న భీమవరం డీఎల్‌పీఓ సీహెచ్.వెంకట బాలాజీ పంచాయతీ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. తక్కువ రేటుకు టెండర్లు వేసి ఉద్యోగాలు మానే సిన వారిని తొలగించి వార్డుసభ్యులు ఆమోదించిన పంచాయతీ కార్మికు లను పనిలోకి చేర్చుకుని వారికి పెండింగ్ జీతాలివ్వాలని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈఓపీఆర్డీ ఆంజనేయులు, కార్యదర్శి లక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యుడు పాల్గొన్నారు. సర్పంచ్ లక్ష్మి సైతం జీతాలివ్వాలని ఆదేశించారు.

శ్రీవారి సేవలో విశ్రాంత న్యాయమూర్తి



విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్‌కు మెమెంటో ఇస్తున్న ఏఈవో

ద్వారకాతిరుమల, ఆగస్టు 3: ద్వారకా తిరుమల చిన వెంకన్నను ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జి. భవానీప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా ఆలయ ఏఈఓ నట రాజారావు జ్ఞాపిక, ప్రసాదం అందించారు.

భక్తులతో ఆలయం కళకళ..

చిన్నతిరుమలేశుని ఆలయం శనివారం భక్తులతో కళకళలాడింది. ఉచిత దర్శనానికి గంట పైబడి సమయం పట్టింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆ తరువాత వకుళమాత అన్నప్రసాద భవనానికి వెళ్లి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆర్టీసీ బస్సులు సైతం భక్తులతో కిటకిట లాడాయి.



జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, ఆగస్టు 3 : జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలో శనివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా రహదారులపై పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు ఉండాలని, వాహన ఇన్సూరెన్సు, సీ-బుక్ ఉండాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు ఎక్కువ మంది తలకు దెబ్బతగిలి ప్రాణాలు కోల్పోతున్నారని అదే హెల్మెట్. ధరిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చునని తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు.

రవాణా కార్యాలయం వద్ద రగడ

భీమవరం క్రైం, ఆగస్టు 3 : ప్రైవేటు స్కూల్ డ్రైవర్‌కు హోంగార్డుకు మధ్య తలెత్తిన వివాదం రచ్చకెక్కింది. ఈ నెల 2న ఒక ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్ రోడ్డుపై వెళ్తుండగా ఆర్టీవో కార్యాలయంలో పనిచేసే హోంగార్డుకు డ్రైవర్‌కు మధ్య వివాదం జరిగింది. దీంతో ఆ బస్సు డ్రైవరు రవాణాశాఖ అధికారులకు పిర్యాదు చేసేందుకు శనివారం వెళ్ళగా అక్కడే ఉన్న హోంగార్డు కోపోద్రిక్తుడై అధికారులకు ఫిర్యాదు చేస్తావా అంటూ బస్సు డ్రైవర్ పై చేయి చేసుకున్నాడు. దీంతో బస్సు డ్రైవర్ తోటి బస్సు డ్రైవర్‌లను రవాణాశాఖ కార్యాలయానికి రప్పించడంతో అక్కడ వాగ్వాదం జరిగింది. చివరికి రవాణాశాఖ అధికారి కొందరు అధికారులు అక్కడకు చేరుకుని నచ్చ చెప్పారు. హోంగార్డుతో బస్ డ్రైవర్‌కు క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది.

కానిస్టేబుల్‌పై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 3 : జిల్లా కలెక్టరేట్‌లో తనకు తెలిసిన అధికారి ఉన్నాడని ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక లాండ్రీ నిర్వాహకుడి కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఏడు లక్షల రూపాయలు కానిస్టేబుల్ తీసుకుని మోసగించాడని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన భీమవరపు లింగేశ్వరరావు ఇస్త్రీ చేస్తూ ఉంటాడు. అతని వద్దకు ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ డి. శ్రీనివాసరెడ్డి (పిసి 586) తన వస్త్రాలు ఇస్త్రీ చేయించుకోవడానికి వస్తూ ఉండేవాడు. లింగేశ్వరరావు కుమారుడు నాగేశ్వరరావు నిరుద్యోగిగా ఉన్నాడు. తనకు ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో తెలిసిన అధికారి ఉన్నాడని ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని దఫదఫాలుగా ఏడు లక్షల రూపాయలను నాగేశ్వరరావు నుంచి తీసుకున్నాడు. 2023 మే 16వ తేదీ నుంచి 2024 మే 26వ తేదీ వరకు ఈ సొమ్ములను తీసుకున్నాడు. ఆ తరువాత సమాధానం చెప్పకపోవడంతో బాధితుడు ఏలూరు వన్‌టౌన్ పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి ఇదే విధంగా అనేక మందిని మోసగించినట్లుగా ఇంకా బాధితులు ఎందరో ఉన్నారని చెప్తున్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

ఉంగుటూరు, ఆగస్టు 3: చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లగూడెంలో పదో తరగతి చదువుతున్న బాలిక పట్ల దౌర్జన్యం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బాలిక పాఠశాలకు వెళ్లి సైకిల్‌పై జూలై 31న ఇంటికి వెళుతున్న సమయంలో గోపీనాథపట్నం గ్రామానికి చెందిన ఉప్పాటి రామకృష్ణ గొల్లగూడెం శివారు నల్లమాడు రోడ్డులో బాలికను ఆపి అసభ్యంగా ప్రవర్తించి ఇబ్బంది పెట్టడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు చేబ్రోలు ఎస్సై ఏ.మణికుమార్ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో..

ముగ్గురి అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ

పాలకొల్లు రూరల్, ఆగస్టు 3 : పాలకొల్లు పట్టణంలో గత నెల 29న వృద్ధురాలిపై అత్యాచారం, దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ ఆసిం తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో నివసిస్తున్న పక్షవాత రోగి అయిన వృద్ధురాలిపై పాత నేరస్థుడైన అమలాపు రానికి చెందిన బొక్కా రాజు, పాలకొల్లు మావుళ్ళమ్మ పేటకు చెందిన మీసాల మావుళ్ళు, రాజమండ్రి వాంబే కాలనీకి చెందిన గుబ్బల రామకృష్ణను స్థానిక సంతమార్కెట్ ఏరియాలో అదుపులోకి తీసుకుని సుమారు రూ. 4 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు, స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయంలో నిందితులు చోరీ చేసేందుకు ఇంట్లోకి వచ్చి హాల్లో షెల్ఫ్‌లోని మొబైల్‌ను తీసి జేబులో పెట్టుకున్నారని అనంతరం 75 ఏళ్ళ వృద్ధురాలిని హతమార్చి ఆమె ఒంటిపైన గల నగలను కాజేసేందుకు ఒకరు వృద్ధురాలిని దిండుతో ముఖంపై గట్టిగా అదిమి పట్టగా మరొకరు సిమెంట్ దిమ్మెతో ఆమె తలపై కొట్టి గాయపరిచారని ఎస్పీ తెలిపారు. అనంతరం ఆమె ఒంటిపై గల బంగారు ఆభరణాలతో పాటు గదిలో హ్యాండ్ బ్యాగ్‌లోగల రూ.15 వేలు దొంగిలించారు. అనంతరం నిందితుల్లో ఒకరు వృద్ధురాలిపై అత్యాచారం చేసి పారిపోయారని, దీనిపై వృద్ధురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు వారి ఇంటిలోని సీసీ పుటేజ్ చూసి పట్టణ సీఐ మంగాదేవి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. శనివారం ఉదయం నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. నరసాపురం డీఎస్పీ జి. శ్రీనివాసరావు, పాలకొల్లు సీఐ కె. మంగా దేవి, పట్టణ ఎస్ఐ బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



యల్లా రాజు (ఫైల్)

ఆచంట, ఆగస్టు 3: మండలం లోని భీమలాపురంలో జూనియర్ లైన్ మన్‌గా పని చేస్తున్న యల్లా రాజు (30) విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లైన్‌మన్ రాజు విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా కరెంటు సరఫరా రావడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. తలకు బలమైన గాయమవడంతో వెంటనే 108లో పాలకొల్లు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. విద్యుత్ సరఫరా నిలిపి పనులు చేస్తున్నా కరెంటు సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. రాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దెందులూరు/ఏలూరు క్రైం, ఆగస్టు 3: దెందులూరు పంచాయతీ పరిధిలోని అలుగులగూడెం రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని యువకుడిని గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సుంటుందని, నలుపు రంగు టీషర్టు, బిస్కట్ రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టాలు దాటేటప్పుడు రైలు ఢీ కొనడం వల్ల మరణించి ఉంటాడని ప్రాథమికంగా గుర్తించారు. ఎస్ఐ సైమన్ సెల్ నెంబర్ 9989219559కు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ..

మొగల్తూరు: కాళీపట్నం తూర్పు పంచాయతీలో 216 జాతీయ రహదారిపై శనివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందినట్టు ఏఎస్ఐ కె.సత్యనారాయణ తెలిపారు. భీమవరం మండలం నాగిడిపాలెం పంచాయతీ రెడ్డి చెరువు గ్రామానికి చెందిన పొన్నమండ ఐరావతి (70) అనే వృద్ధురాలు చిన్నగొల్లపాలెంలోని తన కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళుతోంది. కాళీపట్నం తూర్పు పంచాయతీలోని జాతీయ రహదారిపై ఈమెను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక బైపాస్ రోడ్డులోని ఎస్సార్ పెట్రోల్ బంకు నుంచి రాజమండ్రి వెళ్ళే రహదారిలో దాబా వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటరమణ (32)గా గుర్తించామన్నారు. మృతుడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. బైపాస్ రోడ్డుపై నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. డీఎస్పీ రవిచంద్రా రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని పరిశీలించి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులు చదువులో రాణించాలి : ఎమ్మెల్యే


పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, ఆగస్టు 3 : విద్యార్థులు చదువులో రాణించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో పాఠ్య పుస్త కాలు నోట్స్‌లు శనివారం అందజేశారు. కూటమి ప్రభుత్వం విద్య వైద్యం వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అధ్యాపకులు చెప్పిన కళాశాల సమస్యలతోపాటు నిలిచిన స్టేడియం పనుల సమస్యపై సంబంధిత అధికా రులతో మాట్లాడతా మన్నారు. కళాశాల్లో బాలుర వసతి గృహం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. జనసేన టీడీపీ బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, కొండపల్లి ప్రసాద్, బీజేపీ జిల్లా కార్యదర్శి చాత్రాతి ప్రసాద్, ప్రిన్సిపల్ బొరగం సతీష్‌కుమార్, జనసేన నాయకులు కోలా మధు, శాఖమూరి సాయి, గద్దె సుబ్రమణ్యం, నందికోల వీర్రాజు అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

విద్యాశాఖాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


విద్యాశాఖాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, ఆగస్టు 3 : పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడుతానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. తాడేపల్లిగూడెం డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారిణి రవీంద్ర భారతి, నాలుగు మండలాల విద్యాశాఖాధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీవారి సేవలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి


ఆశీర్వచనం పొందుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

ద్వారకాతిరుమల, ఆగస్టు 3: శ్రీవారిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు అర్చకులు స్వామివారి శేష వస్త్రాన్ని అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. అధికారులు ఆయనకు స్వామి వారి ప్రసాదం అందించారు. టీడీపీ నేతలు ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి, గువ్వల మావుళ్లు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం ఏర్పాట్లపై సమీక్ష

బుట్టాయగూడెం, ఆగస్టు 3 : కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఈ నెల తొమ్మిదిన జరిగే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం ఏర్పాట్లపై శనివారం ఐటీడీఏలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీవో జి.శ్రీను కుమార్, ఐటీడీఏ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వినతి


సీఎంకు వినతి పత్రం ఇస్తున్న రామకుమార్

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 3 : పట్టణ టీడీపీ నాయకులకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పద వులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబును శనివారం కలిసి కోరినట్లు జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్ తెలిపారు. రామకుమార్‌తో పాటు నాయకులు తూటిగుంట రాము, నంబూరి రామచంద్రరాజు, రాజాన సత్యనారాయణ, చిట్రోజు తాతాజీ, కంపా రాజేంద్ర ఉన్నారు.

ఉన్నత విలువలు పాటించాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 :నాయకత్వ విధులు సక్రమంగా నిర్వర్తించాలని, ఉత్తమ విలువలతో రాణించాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి అన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి సంఘ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం శనివారం కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ నూతనంగా విద్యార్థి సంఘ అధ్యక్షురాలిగా ఎన్నికైన లిసా జోశ్, ఉపాధ్యక్షురాలు కుసుమ, కార్యదర్శి జ్ఞానిజైన్, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలకుమారిని సన్మానించారు. వైస్ ప్రిన్సి పాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం


సొంగా సందీప్

ఏలూరు రూరల్, ఆగస్టు 3: సుప్రీం కోర్టు తీర్పు మాదిగల బతుకుల్లో వెలుగులు నింపిందని, లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ హర్షం వ్యక్తం చేశారు. మాదిగల చిరకాల ఆకాంక్ష నెరవే రిందన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందాకృష్ణ మాదిగకి, తీర్పు వెల్లడించిన న్యాయమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల కమిటీ చైర్మన్ల ఎంపిక పై సమావేశం

కుక్కునూరు, ఆగస్టు 3 : పాఠశాల కమిటీ చైర్మన్‌ల ఎంపికలో కూటమి నాయకులు శనివారం కుక్కునూరులో సమావేశమయ్యారు. ఈ నెల 8వ తేదీన పాఠశాలల కమిటీ చైర్మన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో కూటమికి సంబంధించిన వారు ఎన్నికల్లో విజయం సాధించాలని సమావేశంలో నిర్ణయించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, బీజేపీ మండల కోశాధికారి వాడపల్లి లక్ష్మణాచార్యులు, జనసేన మండల అధ్యక్షుడు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలి

లింగపాలెం, ఆగస్టు 3: ప్రతి పంచాయతీలోని వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి పరిశుభ్రమైన నీటిని గ్రామస్తులకు అందించాలని ఎంపీడీవో వి.రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు నిల్వఉన్న దగ్గర బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఈవోపీఆర్డీ జేఎం రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొత్త బోరుకు భూమి పూజ

ఏలూరు రూరల్, ఆగస్టు 3: స్థానిక 23వ డివిజన్ విద్యానగర్, నమస్కారం చర్చ్ సమీపంలో మంచినీటి బోరు పాడైంది. మంచినీటికి ఇబ్బంది తలెత్తింది. దీంతో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య తక్షణం స్పందించి కొత్తబోరును మంజూరు చేశారు. శనివారం ఉదయం మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాల రావు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి గూడవల్లి శ్రీనివాస్, వేమూరి శ్రీధర్, రెడ్డి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

జంగారెడ్డిగూడెం, ఆగస్ట 3 :పేరంపేటలో శుక్రవారం చిలపరెడ్డి సుబ్బారెడ్డిపై కత్తితో దాడి చేసిన మాకిరెడ్డి సుబ్రమణ్యారెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఉంగుటూరు, ఆగస్టు 3: వెల్లమిల్లి పంచాయతీ శివారు లంబాడి పేటకు చెందిన వివాహిత (26) అదృశ్యమైనట్టు ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ ఏ.మణి కుమార్ తెలిపారు. లంబాడి పేటకు చెందిన బానోతు పండు మోటారు సైకిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా తన భార్య రెండు రోజుల నుంచి కనిపించడం లేదని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


బూసరాజుపల్లిలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కిశోర్‌కుమార్



ధర్మాజిగూడెంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్


మర్రిగూడెం లో మొక్కలు నాటుతున్న దృశ్యం

గంజాయికి బానిసలు కావద్దు

న్యాయ విజ్ఞాన సదస్సుల్లో న్యాయమూర్తులు

లింగపాలెం, ఆగస్టు 3: ధర్మాజిగూడెంలోని సాయి జూనియర్ కళాశాలలో ర్యాగింగ్, మాదకద్రవ్యాల నివారణ అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి, పశ్చిమగోదావరి న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కళాశాలల్లో ర్యాగింగ్ ఒక సమస్యగా మారిందన్నారు. విద్యార్థులు గంజాయికి దూరంగా ఉండాలని అన్నారు. చింతలపూడి మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ క్రాంతి, చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ప్యానల్ లాయర్ శ్రీనివాస్ పట్నాల, పారా లీగల్ వలంటీర్ అక్బర్‌అలీ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 3 : కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరో హించాలని న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ కిశోర్‌కుమార్ అన్నారు. బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సివిల్ జడ్జి అధ్యక్షతన జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ నిరోధక చట్టాలు, లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకముందు మర్లగూడెం కమ్యూనిటీ హాలులో గిరిజన హక్కుల రక్షణ అమలు పథకం 2015 అభివృద్ధి ప్రకారం ఉచిత ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముల్లపూడి శ్రీనివాస రావు, జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు, సభ్యులు యు.ఏసుబాబు, ఎం.క్రాంతి కుమార్, ఏవీ వీ భువనేశ్వరి, కె.హరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేష్‌కుమార్, అంతర్వేదిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు శివసౌమ్య, ఎస్సై వెంకన్న, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల పై అవగాహన ఉండాలి

టి.నర్సాపురం, ఆగస్టు 3: గిరిజన చట్టాల పై గిరిజనులందరికి అవగాహన ఉండాలని జిల్లా లోక్ అదాలత్ కోర్టు జడ్జి కె.రత్నప్రసాద్ తెలిపారు. మర్రిగూడెంలో జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం, గిరిజనుల హక్కుల రక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్య బృందం అనారోగ్య బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రబలుతున్న విషజ్వరాలు, అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ వసతి సదుపాయాల పై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం గిరిజన చట్టాలు వాటి పరిరక్షణ పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. చింతలపూడి కోర్టు మేజిస్ట్రేట్ చిన్నం మధుబాబు, జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సై దుర్గామహేశ్వరరావు, చింతలపూడి బార్ ప్రెసిడెంట్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు


పెదపాడు పరిసరాల్లో ఎండిపోతున్న నారుమడులు

పెదపాడు, ఆగస్టు 3 :రైతన్నలకు ఆదిలోనే సాగునీటి కష్టాలు తప్పలేదు. గత వైసీపీ ప్రభుత్వం కాలువల మరమ్మ తులను సకాలంలో చేపట్టకపోవడం వల్లనే మొదట్లోనే సాగు నీటి కష్టాలు ఎదురయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. పెదపాడు మండల పరిధిలో కృష్ణా కాల్వ కింద 13 వేల ఎకరాల్లో రైతులకు సాగుకు సన్నద్ధం కాగా, ఇందులో నాలుగు వేల ఎకరాల వరకు నాట్లు వేశారు. ఇంకా తొమ్మిది వేల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉండగా ఆకుమడులకు సరిపడ నీరు అందక పెదపాడు, రాజుపేట, సత్యవోలు పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు ఎండిపోతున్నాయి. రిజర్వాయర్ల నుంచి అధికారులు నీటిని విడుదల చేసినా కిందకు రాకపోవడానికి ప్రధాన కారణం కాల్వకు మరమ్మతులు లేకపోవడమేనని రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వ వెంబడి ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

నీరు కిందకు వచ్చేలా చూడాలి



సాగునీరు విడుదల చేసినా కాల్వ వెంబడి కిందికి రావడం లేదు. రైతులు నీటి కోసం రాత్రి, పగలు కాల్వల వెంబడి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

- కాకరాల రామకృష్ణ ప్రసాద్ (బుజ్జిబాబు), పెదపాడు మాజీ సర్పంచ్

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల ధర్నా


విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం,ఆగస్ట 3 : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (327) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటేషన్‌పై ఎల్ఎన్డీ పేట లో లైన్ ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తున్న వైఆర్ఆర్ మోహనరావు కుమారుడికి ఇటీవల కిడ్నీ మార్పిడి జరిగిందన్నారు. తమ యూనియన్ తరుపున విద్యుత్ శాఖ సీఎండీ పృధ్వీతేజ్‌ను కలిసి ఎల్ఎన్డీ పేటలో రెగ్యులర్‌గా పనిచేయుటకు ఆర్డరు ఇప్పించాలని కోరగా ఆయన మానవత దృక్పదంతో స్పందించి జిల్లా ఎస్ఈకి ఆర్డరు పంపించారన్నారు. కానీ స్థానిక ఈఈ రాధాకృష్ణ ఉన్నతాధికారు లు చెప్పింది అమలు చేయడంలేదని ఆరోపించారు. అలాగే లైన్‌మెన్‌ల నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్లు వచ్చిన ఐదుగురిని వారి విల్లింగ్ తీసుకోకుండా ఆయన వేరే చోట వేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద రెండు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు.సమస్య పరిష్కరించే వరకు నిరసన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. కొంతసేపటికి ఈఈ రాధాకృష్ణ యూనియన్ ముఖ్య నాయకులతో మాట్లాడి లైన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌ను ఎల్ఎన్డీపేటలో రెగ్యులర్ ఉద్యోగిగా పనిచేయడానికి ఆర్డరు ఇచ్చారని, లైన్ ఇన్‌స్పెక్టర్‌లుగా ప్రమోషన్లు వచ్చిన వారికి కూడా వారి విల్లింగ్‌ను బట్టి పని చేయడానికి ఆర్డరు ఇచ్చారని 327 యూనియన్ నాగేశ్వరరావు తెలిపారు. స్పందించిన ఈఈ రాధాకృష్ణకు యూనియన్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కృష్ణంరాజు, వి.రాము,జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు చిన్నం శ్యాంబాబు, కార్యదర్శి టి.మురళీమోహనరావు పాల్గొన్నారు.

మనస్సున్న మారాజులు

ఇంజనీరింగ్ విద్యార్థికి రూ.లక్షా 90 వేలు సాయం


ఓంకార్ కు నగదు అందచేస్తున్న వెంకటరాజు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 3 : ఇంజనీరింగ్ చదువుకునే విద్యార్థి చల్లగోళ్ళ ఓంకార్‌కు హాస్టల్ ఫీజు నిమిత్తం కొయ్యలగూడెం మండలం బయ్యన గూడెంకి చెందిన నాటకశాల వెంకట రాజు శనివారం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్‌లో రూ. లక్షా 90 వేలను అందజేశారు. విద్యార్థి చదువుకయ్యే ఖర్చు మొత్తం రూ. ఐదు లక్షలు తానేభరిస్తానని వెంకటరాజు హామీ ఇచ్చారు. దాత వెంకటరాజును సన్మానిం చారు. ఎంబీ సోషల్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మల్లాది సీతారామారావు, ప్రస్తుత అధ్యక్షుడు ఇళ్ళ సోమేశ్వరరావు, బండారు పద్మారావు, దాసం కృష్ణ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.41 వేలు సాయం


ఇంజినీరింగ్ విద్యార్థినికి నగదు అందజేస్తున్న సభ్యులు

చింతలపూడి, ఆగస్టు 3: పట్టణంలోని ఘంటావారి వీధికి చెందిన సుంకర యామిని అనే విద్యార్థినికి రూ.41 వేలు ఆర్థిక సహాయాన్ని పట్టణ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు టీఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ఏపీ ఎంసెట్‌లో యామినికి ఏడు వేల ర్యాంకు వచ్చి, బీమిలిలోని ఇంజినీరింగ్ కళాశాలలో సీటు వచ్చిందన్నారు. అయితే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు వల్ల చదివించలేని పరిస్థితి ఉందని, విద్యార్థినికి భరోసా ఇస్తూ తాము ఈ సహాయం అందించామని తెలిపారు. కె.శేషగిరిరావు, జి.నాగభూషణం, ఎం.గణేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల సాయం అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం,ఆగస్ట 3 : పంగిడిగూడెం గ్రామానికి చెందిన దొడ్డిగర్ల సూర్య చంద్రరావు మెదడు సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. ఆస్పత్రి ఖర్చులు, కుటుంబ పోషణ భారంగా ఉండడంతో స్పం దించిన వసుధ ఫౌండేషన్ సభ్యులు శనివారం పట్ట ణంలో ఆయన భార్యకు రూ.20 వేల చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ చెర్మన్ మంతెన వెంకట రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు చోడే ఫణి చంద్రశేఖర్, కొండపల్లి పండు కొండేపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలి


సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ స్వర్ణభారతి

కామవరపుకోట, ఆగస్టు 3 : పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ జంగం స్వర్ణభారతి పేర్కొన్నారు. తన కార్యాలయంలో మండ లంలోని పంచాయతీ, సచివాలయ కార్య దర్శులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంచినీటి సౌక ర్యాలను, వీధి దీపాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పింఛన్ల పంపి ణీలో 99.37 శాతం ప్రగతి సాధించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఓ సత్యవాణి, ఈవోపీఆర్డీ మరిదయ్య, పంచాయతీ కార్యదర్శులు జీడీవీ శ్రీనివాసరావు, జీవీ సత్యనారాయణ, జె.సుబ్బారావు, నేతల విజయ్, రాజేష్, బాలాజీ తదితరులు ఉన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

భీమడోలు, ఆగస్టు 3 : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భీమడోలు సీఐ రవికుమార్ అన్నారు. భీమడోలులోని మాంటిసోరి విద్యాసంస్థల సంబంధించి మాధురి జూనియర్ కళాశాల, మాధురి ఒకేషనల్, రత్నా డిగ్రీ కళాశాలలకు సంబం ధించిన ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ రవికుమార్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. అగ్నిమాపక అధికారి నాగరాజు, జడ్పీటీసీ భవానీ రంగ, సర్పంచ్‌లు సునీతా మాన్‌సింగ్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ప్రత్తి మదన్, కళాశాల కరస్పాండెంట్ ప్రేమ్‌కుమార్ స్వాతి మాధురి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్రీరాట్నాలమ్మవారికి ఆషాఢం సారె



పెదవేగి, ఆగస్టు 3 : రాట్నాల కుంట శ్రీరాట్నాలమ్మవారికి భక్తులు ఆషాడం సారె సమర్పించారు. రాయన్నపాలేనికి చెందిన మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పలు రకాల పండ్లు, భారీగా మిఠాయిలను తీసుకుని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా రాయన్నపాలేనికి చెందిన మంచినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామదేవతైన శ్రీరాట్నాలమ్మవారి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో సారెను సమర్పించడం ఆనవాయితీ అన్నారు. ఈ ఏడాదికూడా అమ్మవారికి సారెను సమర్పించామని ఆయన చెప్పారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

చింతలపూడి, ఆగస్టు 3: ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్లో మండల ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో ఆయనకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చేపడుతున్న చర్యలు ప్రశంసనీయంగా ఉన్నాయన్నారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మాటూరి వెంకటరామయ్య ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసి నాయకులు మాటూరి చక్రదర్‌రావు, ఎం.శామ్యూల్, ఎన్.ఆస్కార్, దామోదర్, కాంతారావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొని మాట్లాడారు.

సీఆర్ఆర్ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 : సీఆర్ఆర్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం కళాశాల కరస్పాండెంట్ కొడాలి వెంకటసుబ్బారావు విడుదల చేశారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ రామరాజు తెలిపారు. రీవాల్యూయేషన్‌కు ఈ నెల ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఫైనలియర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12 నుంచి జరుగుతాయని, పరీక్ష ఫీజు ఆరో తేదీ నుంచి చెల్లించవచ్చని పేర్కొన్నారు.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

బుట్టాయగూడెం, ఆగస్టు 3 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతోపాటు కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ఐదు మండలాల్లో డిగ్రీతోపాటు బీఈడీ, ఇంటర్‌తోపాటు డీఈడీ పూర్తిచేసి టెట్‌లో ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులకు ఐటీ డీఏ వైటీసీలో డీఎస్సీకి ప్రత్యేక ఉచిత శిక్షణ ఇస్తున్నామని పీవో జి.శ్రీనుకుమార్ తెలిపారు. మహిళలకు 33.1/3 శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తేదీలోగా కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. పరిశీలన అనంతరం 14న ఫైనల్ లిస్టును ఐటీడీఏ కార్యాలయం నోటీస్ బోర్డులో ఉంచుతామన్నారు. ఆగస్టు మూడో వారం నుంచి 90 రోజులపాటు 100 మందికి భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ ఇస్తామన్నారు. మార్చి 2024లో శిక్షణ తీసుకున్నవారికి రిఫ్రెషల్ శిక్షణ ఇవ్వడం జరుగు తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 96039 94333, 94902 85277 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

దర్శనాలు త్వరగా ముగించుకొని వెళ్లండి

బుట్టాయగూడెం, ఆగస్టు 3 : గుబ్బల మంగమ్మతల్లి దర్శనానికి ఏజెన్సీ ప్రాంతానికి ఆదివారం వచ్చే భక్తులు సాయంత్రం మూడు గంటల కల్లా అటవీ ప్రాంతం నుంచి బయటకు వెళ్ళాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏజెన్సీ అటవీ ప్రాంతంలో ఏదో ఒకచోట వర్షం కురుస్తూనే ఉందని కొండవాగులు పొంగుతున్నాయని చికటిపడే వరకు అడవిలోనే ఉండటం శ్రేయష్కరం కాదన్నారు. భక్తులు ఆలయ కమిటీకి సహకరించాలని కోరారు.

జనసేన నేత శేషుకు సత్కారం


శేషుకు పుష్పగుచ్చం ఇచ్చి సత్కరిస్తున్న యువత

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 3 : జనసేన నేత నారా శేషును నగ రంలోని ఒక ప్రైవేటు సంస్థకు చెందిన సీఈవో ఎస్.హేమంత్, వారి సిబ్బంది కలిసి జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వాలు అందించి నందుకుగాను పుష్పగుచ్ఛాలు అం దచేసి దుశ్శాలువాలతో సత్కరించారు.

7న శ్రావణ లక్ష్మి సరదాల సంతోషం

ఏలూరు రూరల్, ఆగస్టు 3: అర్బన్ జిల్లా ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన అల్లూరి సీతా రామరాజు స్టేడియం సమీపంలో ఉన్న టబాకో మర్చంట్స్ చాంబర్ కల్యాణ మండ పంలో శ్రావణలక్ష్మి సరదాల సంతోషం పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వేషదారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు టి.అరుణవెంకటకుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

నోటు పుస్తకాల పంపిణీ

చింతలపూడి, ఆగస్టు 3: స్థానిక ఉర్దు పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్వీట్లు రాజీయుథామస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ మారుమూడి థామస్ అందజేశారు. ఉపాధ్యాయిని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

పెదపాడు, ఆగస్టు 3 :ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేం దుకు చర్యలు తీసుకుంటోందని ఎంఈవో-2 సబ్బితి నరసింహ మూర్తి తెలిపారు. అప్పనవీడు, తాళ్లమూడి ఎంపీపీఎస్ పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు.


రాజీవ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ బ్యూలా


పోతునూరులో మాట్లాడుతున్న జిల్లా పీడీ పద్మావతి


పెదవేగిలో తల్లిపాలు ప్రాముఖ్యతను తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిబ్బంది


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సెక్టారు సూపర్‌వైజర్ కుమారి


రామన్నపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సిబ్బంది

తల్లిపాలుతోనే బిడ్డకు ఆరోగ్యం

జంగారెడ్డిగూడెం, ఆగస్ట 3 : బిడ్డలకు తల్లిపాలు పట్టడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ పి.బ్యూలా అన్నారు. తల్లిపాల వారోత్సవాల లో భాగంగా శనివారం పట్టణంలోని అంగన్ వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో సీడీపీఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్ర మే పట్టాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఝాన్సీ కృష్ణ కుమారి, సుబ్బాయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

- పోలవరం : స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్వాడీలకు జరిగిన అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ స్వర్ణకుమారి పలు సూచనలు చేశారు ఎంపీడీవో శ్రీను, వింజరం వైద్యాధికారి వాసువర్మ, హెచ్‌ఎస్ పాండురంగారావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.
- దెందులూరు : పోతునూరు ప్రభుత్వ పాఠశాలలో పెదపాడు ప్రాజెక్టు సీడీపీవో విజ యలక్ష్మీ, అడిషనల్ సీడీపీవో రాజశేఖర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కేవీఎల్ఎన్ పద్మావతి తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను గర్భిణులకు బాలింతలకు వివరించారు. సర్పంచ్ బొదుల స్వరూప్(నాని), ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు డాక్టర్ చైతన్య, అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్ శ్రీదేవి, ఎస్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు
- పెదవేగి : కూచింపూడి శివారు గోవిందవారి గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలు తాగే బిడ్డల ఆరోగ్యంపై పెదవేగి సెక్టారు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి రాణి, మహిళా సంర క్షణ కార్యదర్శి షేక్ అకీరా, ఏఎన్ఎం కారుణ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- పెదపాడు : వట్లూరులోని శారీపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. తల్లి పాల ప్రాముఖ్యత, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన వట్లూరు సెక్టారు సూపర్‌వైజర్ కె.కుమారి తెలిపారు. పెదపాడు మండలం కల్పించారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కామవరపుకోట : మండలంలోని తల్లీపాల వారోత్సవాలపై జరిగిన అవగాహన కార్యక్రమాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంగాదేవి, వీరకుమారి పలు విషయాలను గర్భిణులకు వివరించారు. తల్లిపాలతోనే తల్లిబిడ్డకు రక్షణ ఉంటుందని, తల్లిపాలకు మించిన ఔషధంలేదన్నారు. ఎంఎల్‌హెచ్ రుక్మిణి, ఏఎన్ఎంలు పద్మావతి, భారతి, జగదీశ్వరి, రాధ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పంచాయతీల బాధ్యత


నరశింహారావుపాలెంలో మురుగుకాల్వలు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

చాట్రాయి, ఆగస్టు 3: వర్షాకాలంలో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేయటం గ్రామ పంచాయతీల బాధ్యత అని నూజివీడు డీఎల్‌పీవో సుందరి స్పష్టం చేశారు. నరశింహారావుపాలెంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నదని కొందరు గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో డీఎల్‌పీవో శనివారం గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో కచ్చా డ్రెయిన్లలో పూడిక తీయించి మురుగునీరు, వర్షం నీరు నిల్వ ఉండకుండా చెయ్యాలని, వీధులలో బ్లీచింగ్ చల్లించాలని సర్పంచ్ ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజును ఆదేశించారు.

డీఎల్‌పీవోకు రజక సంఘ నాయకుల సత్కారం

ముదినేపల్లి, ఆగస్టు 3: ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి కె.పూర్ణ చంద్ర శేఖర్‌ను ముదినేపల్లి రజక సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ముదినేపల్లి వచ్చిన ఆయన్ని సంఘ అధ్యక్షుడు యలకుర్తి నాగరాజు, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, సంయుక్త అధ్యక్షులు నూతక్కి శ్రీనివాసరావు, కార్యదర్శి పోతార్లంక హేమంత్ తదితరులు కలసి సత్కరించారు. గ్రామాల్లో రజకులకు చెరువులను కేటాయించాలని కోరారు.

సచివాలయంలో ప్రజాప్రతినిధుల చిత్రపటాలు



ముసునూరు, ఆగస్టు 3: ముసునూరు గ్రామ సచివాలయంలో ప్రజా ప్రతినిధుల చిత్రపటాలను టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా శనివారం ఆవిష్కరించారు. సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా ఆధ్వర్యంలో సమకూర్చిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొలుసు పార్థసారథి చిత్రపటాలను నియోజకవర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్ కిరణ్(బాబి), ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు తులిమెల్లి రంగరావు సచివాలయంలో ఏర్పాటు చేశారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

ముసునూరు, ఆగస్టు 3: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని మండల విద్యాశాఖ అధికారి బి.వి సుబ్బారావు అన్నారు. శనివారం ముసునూరు ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికల ఓటరు జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన ఉదయం 9గంటల నుంచి 1గంట వరకు ఓటరు జాబితాల్లో అభ్యంతరాలను స్వీకరించబడతాయని తెలిపారు. ఎన్నికల అధికారిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారని తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


ముసునూరులో ఎరువుల దుకాణం రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో మధుమోహన్

ముసునూరు, ఆగస్టు 3: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులు, పురుగుమందులను దుకాణదారులు రైతులకు అందించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఎస్.మదుమోహన్ అన్నారు. శనివారం ముసునూరులో ఉన్న శ్రీమురళీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, స్టాక్ రిజిష్ట్రర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ లేని ఒక దుకాణానికి చెందిన 10లీటర్ల బారాజైడ్ అమ్మకాలను ఆయన నిలుపుదల చేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం

ముసునూరు, ఆగస్టు 3: అక్కిరెడ్డిగూడెం ఏసీకాలనీకి చెందిన సీనియర్ టీడీపీ కార్యాకర్త డోలా నాగేశు రెండు రోజుల క్రితం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, గ్రామపార్టీ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, నాయకులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.6వేలు నగదును అందజేశారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడి అరెస్టు

ముదినేపల్లి, ఆగస్టు 3 : సహజీవనం చేస్తూ వివాహం చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేశాడన్న ఓ యువతి ఫిర్యాదుపై నిందితుడిని శనివారం ముదినేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ డి.వెంకట్ కుమార్ కథనం ప్రకారం ముదినేపల్లి మండలం ఒక గ్రామానికి చెందిన ఓ వివాహిత యువతికి ఏలూరు రూరల్ మండలం ఆగడాల లంక గ్రామానికి చెందిన దేవభూషణం అనే యువకుడికి సుమారు ఏడాదిన్నర క్రితం పరిచయం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఆ యువతి భర్తను వదిలేసి దేవభూషణంతోనే సహజీవనం చేస్తూ ఆ గ్రామం నుంచి చేపల పట్టుబడి పనులకు వెళ్లే వారు. కొంతకాలం తర్వాత అతనికి వేరే యువతితో సంబంధం ఉందని ఫోన్ సంభాషణల ద్వారా బయట పడటంతో వీరిద్దరి మధ్య విబేధాలు ఏర్పడి నాలుగు నెలల క్రితం విడిపోయారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను మోసం చేశాడని పైగా తనపై నిందలు వేస్తూ ఫేస్ బుక్‌లో కూడ దేవ భూషణం అసభ్యకర పోస్టులు పెడుతున్నాడని ఆ యువతి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దేవభూషణంను శనివారం అరెస్టు చేసి కైకలూరు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ

బుట్టాయగూడెం, ఆగస్టు 3 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతోపాటు కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ఐదు మండలాల్లో డిగ్రీతోపాటు బీఈడీ, ఇంటర్‌తోపాటు డీఈడీ పూర్తిచేసి టెట్‌లో ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులకు ఐటీడీఏ వైటీసీలో డీఎస్సీకి ప్రత్యేక ఉచిత శిక్షణ ఇస్తున్నామని పీవో జి.శ్రీనుకుమార్ తెలిపారు. మహిళలకు 33.1/3 శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తేదీలోగా కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. పరిశీలన అనంతరం 14న ఫైనల్ లిస్టును ఐటీడీఏ కార్యాలయం నోటీస్ బోర్డులో ఉంచుతామన్నారు. ఆగస్టు మూడో వారం నుంచి 90 రోజులపాటు 100 మందికి భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ ఇస్తామన్నారు. మార్చి 2024లో శిక్షణ తీసుకున్నవారికి రీఫ్రెషల్ శిక్షణ ఇవ్వడం జరుగు తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 96039 94333, 94902 85277 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సాగునీటి కష్టాలు


పెదపాడు పరిసరాల్లో ఎండిపోతున్న నారుమడులు

పెదపాడు, ఆగస్టు 3 :రైతన్నలకు ఆదిలోనే సాగునీటి కష్టా లు తప్పలేదు. గత వైసీపీ ప్రభుత్వం కాలువల మరమ్మ తు లను సకాలంలో చేపట్టకపోవడం వల్లనే మొదట్లోనే సాగు నీ టి కష్టాలు ఎదురయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. పెద పాడు మండల పరిధిలో కృష్ణా కాల్వ కింద 13 వేల ఎకరాల్లో రైతులకు సాగుకు సన్నద్ధం కాగా, ఇందులో నాలుగు వేల ఎకరాల వరకు నాట్లు వేశారు. ఇంకా తొమ్మిది వేల ఎకరాల్లో నా ట్లు పడాల్సి ఉండగా ఆకుమడులకు సరిపడ నీరు అందక పెదపాడు, రాజుపేట, సత్యవోలు పరిసర ప్రాంతాల్లోని పం ట పొలాలు ఎండిపోతున్నాయి. రిజర్వాయర్లల నుంచి అధికా రులు నీటిని విడుదల చేసినా కిందకు రాకపోవడానికి ప్రధాన కారణం కాల్వకు మరమ్మతులు లేకపోవడమేనని రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వ వెంబడి ఉన్న అడ్డంకులను తొలగిం చేందుకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

నీరు కిందికి వచ్చేలా చూడాలి



సాగునీరు విడుదల చేసినా కాల్వ వెంబడి కిందికి రావడం లేదు. రైతులు నీటి కోసం రాత్రి, పగలు కాల్వల వెంబడి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

- కాకరాల రామకృష్ణ ప్రసాద్ (బుజ్జిబాబు), పెదపాడు మాజీ సర్పంచ్

మహా గొయ్యి...

చోద్యం చూస్తున్న అధికారులు

ముదినేపల్లి, ఆగస్టు 3 : అది మామూలు గొయ్యి కాదు... మహా గొయ్యి.. రోడ్డు కుంగి ఎంత లోతుకు దిగుతుందా అని ఆర్‌అండ్‌బీ అధికారులు ఎదురుచూస్తున్నారేమో గానీ వాహన చోదకులు మాత్రం ఆ గొయ్యిలో పడిపోయి క్షతగాత్రులవుతున్నారు. ఇది ఎక్కడో మారుమూల కాదు. నిరంతరం వాహనాలు వెళ్లే రాష్ట్ర రహదారిలో సింగరాయపాలెం - భీమవరం ప్రధాన రహదారిలో ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామ సెంటర్‌లో ఏడాది క్రితం ఏర్పడిన చిన్న గొయ్యి ఇప్పుడు ప్రమాదకరమైన పెద్ద గొయ్యిగా రూపు దాల్చింది. చిన్నపాటి వర్షానికే చెరువులా మారుతున్నది. వర్షాలు ఆగిపోయినా ఆ గోతిలో నీరు తగ్గదు. దానంతట అది ఆరాల్సిందే. హైస్కూల్ పక్కనే ఉన్న ఈ మహా గొయ్యి పక్క నుంచి విద్యార్థులు వెళ్లటం కూడా ఇబ్బందికరంగా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే ఆ ప్రమాదకర గొయ్యిని పూడ్చాలని గ్రామ జనసేన నాయకుడు బాసినశెట్టి కిషోర్ కోరారు.


బొమ్మినంపాడు సెంటర్‌లో ఏర్పడిన గొయ్యి

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆనందహేల

నూజివీడు, ఆగస్టు 3: దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీమ్‌కోర్టు ఎస్సీ వర్గీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, ఎమ్మార్పీఎస్‌కు ఎంతో సంతోషకరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. శనివారం నాడు స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, తెలుగుదేశంపార్టీ నాయకులు కేక్‌కట్ చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ, మంత్రి కొలుసు పార్థసారథికి ఎంతో రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు పురపాలక సంఘం కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు చెరుకూరి దుర్గాప్రసాద్, పట్టణ తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంపటి వెంకటేశ్వరరావు, ముళ్ళపూడి రామారావు, తుమ్మలపల్లి అశోక్, బొడ్డు రాజు, కలపాల విలియమ్స్ పాల్గొన్నారు.


నూజివీడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

చంద్రబాబు దయతోనే వర్గీకరణ తీర్పు

నూజివీడు టౌన్: ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దయ వల్లనే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు మార్గం సుగుమం అయ్యిందని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు వెలువడటంతో శనివారం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. మంద కృష్ణ మాదిగ 30 ఏళ్లుగా చేసిన పోరాటానికి ఫలితం లభించిందన్నారు. ఆది నుంచి కృష్ణ మాదిగకు నారా చంద్రబాబు నాయుడు అండగా ఉంటూ వచ్చారన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గా ప్రసాద్, పల్లి నాగరాజు, వేంపటి వెంకటేశ్వరరావు, ముళ్లపూడి రామారావు, తుమ్మలపల్లి అశోక్, బొడ్డు రాజు, కలపాల విలియమ్స్ పాల్గొన్నారు.

చాట్రాయి: తెలుగుదేశం పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమని విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, మాజీ సర్పంచ్ ఘంటసాల మన్మధరావు అన్నారు. చీపురుగూడెం అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ నాయకులు, మాదిగలు కృష్ణమాదిగ, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు


కాకతీయనగర్‌లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మండవల్లి, ఆగస్టు 3: కాకతీయనగర్, మూడుతాళ్లపాడు గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట నాగలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట నాగలక్ష్మీ, మూడుతాళ్లపాడు అంగన్వాడీ టీచర్ సీహెచ్ చెల్లమ్మ ఏఎన్‌ఎం పద్మ, కాకతీయనగర్‌కు చెందిన నాగమణి, దుర్గభవానీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ శనివారం అల్లూరు, వడాలి గ్రామాల్లో ఐసీడీఎస్, వైద్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రసన్న, జాన్సీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.

ముసునూరు: తల్లిపాలలో ఉన్న పోషకాలతో పిల్లలకు వ్యాదినిరోధక శక్తి పెంపొందుతుందని మహిళా పోలీస్ భవాని అన్నారు. ముసునూరు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త మేరి సులోచన ఆధ్వర్యంలో తల్లిపాలు విశిష్టతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు ముర్రిపాలను తల్లులు ఇవ్వడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, పిల్లలకు ప్రతిరోజు సమృద్ధిగా తల్లులు పాలు ఇవ్వాలని అవగాహన కల్పించి, వివిధ రకాల పోషక ఆహార పదార్థాలు గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలం ఈదర సెక్టార్ పరిధిలో ఈదర గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో నూరాణి మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఆ పాలలో పిల్లల పెరుగుదలకు అవసరమైన వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ఆరునెలల వయస్సు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆరునెలల తరువాత అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలని తెలియచేశారు. ఈదర గ్రామసర్పంచ్ దొండపాటి అనిత, ఏసుపాదం మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను తెలిపారు. గర్భవతిగా ఉన్నప్పుడు నుంచి పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో నాగేశ్వరి, సూపర్‌వైజర్ రాగమయి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ


కానుకొల్లులో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మండవల్లి ఆగస్టు 3: కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి చేపట్టిన గంజాయి రహిత గ్రామాలు కావాలని అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలో డ్రగ్స్‌కు అలవాటు పడినవారు మానుకోవాలని స్కూల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవై మాధవరావు ఉపాధ్యాయులు శ్యామ్ పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. తొలుత ప్రభుత్వం పంపిణీ చేసిన బ్యాగులు బెల్టులు విద్యార్థులకు అందించారు.

గంజాయి రహిత రాష్ట్రం కోసం కృషి

ముదినేపల్లి, ఆగస్టు 3 : రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగానికి యువతను దూరంగా ఉంచేందుకు తమవంతు కృషి చేస్తామని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఏపీ ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణం రాజు తెలిపారు. ముదినేపల్లిలో శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ యువ మోర్చా ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు ముఖ్యంగా గంజాయి వినియోగం వల్ల జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నాగ సురేష్, నాయకులు రెడ్డి రాధిక, సత్యవోలు నాగలక్ష్మి, కొత్తపల్లి లక్ష్మీపతిరాజు, కొల్లిపర నాగరాజు పాల్గొన్నారు.

పారిశధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ముదినేపల్లి, ఆగస్టు 3 : గ్రామాల్లో పారిశుధ్య పనులకు పంచాయతీల కార్యదర్శులు ప్రాధాన్యం ఇవ్వాలని ఏలూరు డీఎల్‌పీవో పూర్ణచంద్రశేఖర్ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో వర్షాలు కురుస్తున్న ందున పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపాలని, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగునీటి పారుదల పనులు నిర్వహించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని డిఎల్‌పివో తెలిపారు. ఈవోపిఆర్‌డీ డి.లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సీపీఎం విరాళాల సేకరణ

నూజివీడు టౌన్, ఆగస్టు 3: కేరళ వరద బాధితుల సహాయార్థం నూజివీడు పట్టణంలో సీపీఎం నేతలు శనివారం రూ.6,110 విరాళం కింద సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎస్.ఆర్ హనుమాన్లు, మరియదాసు, శోభనాద్రి శ్రీనివాసరావు, సాంబయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి ప్రతిపాదనలు

ముసునూరు, ఆగస్టు 3: అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలని ఆందోళన..అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్ట్ సీడీపీవో నురాని శనివారం భగీరథ విగ్రహం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, నగరుల కాలనీవాసులు, సర్పంచ్ భర్త, టీడీపీ నాయకులు తల్లిబోయిన సత్య నారాయణ, మాజీ ఉపసర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణలతో అంగన్ వాడీ కేంద్రం అవశ్యకతపై ఆమె చర్చించారు. నూతన భవన నిర్మాణంపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

మడుపల్లి కుటుంబానికి పరామర్శ

ఆగిరిపల్లి, ఆగస్టు 3:ఇటీవల మరణించిన ఆర్యవైశ్య ప్రముఖుడు మడుపల్లి నారాయణరావు కుటుంబాన్ని నూజివీడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య శనివారం పరామర్శించారు. ఈ కుటుంబానితో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుని తాను తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు నారాయణరావు కుమారుడు గోపాల్‌తో ఎలా కలిసి పని చేసింది తెలిపారు. నారాయణరావు కుటుంబానికి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీధికుక్కల దాడిపై ఫిర్యాదు

ఆగిరిపల్లి, ఆగస్టు 3:వీధికుక్కల దాడిలో పాడి గేదె మృతి వార్తకు ఆగిరిపల్లి పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ స్పందించి పంచాయతీరాజ్‌శాఖకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గత వేసవి కాలం వీధికుక్కల కోసం గ్రామంలో అక్కడక్కడ నీటి తొట్టెలు ఏర్పాటుచేసి వాటికి దాహార్తి తీర్చి సంరక్షణచేసి ఎవర్ని కరవకుండా చేశామని, అయినా అడపాదడపా మనుషుల మీద జంతువుల మీద దాడి చేస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. వీధి కుక్కలను నిర్మూలించుట, తరలించుట చేయరాదని నియంత్రణ ఒక్కటే చేపట్టాలని అందుకే పశుసంవర్ధకశాఖ ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటామని నిధులు, లేబర్‌కోసం పంచాయతీలో తీర్మానం పెట్టడం జరుగుతుందని తెలిపారు.

డీపీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి, ఆగస్టు 3: డీపీఆర్‌టీయూ ఆగిరిపల్లి మండలశాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం 2వ రోజు ఆగిరిపల్లి, కొత్తపేట, ఉర్దూ స్కూల్, ఆగిరిపల్లి మెయిన్ స్కూల్, ఆగిరిపల్లి కొండకాలనీ స్కూల్, ఆగిరిపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, వడ్లమాను, చొప్పరమెట్ల, ఈదులగూడెం, వట్టిగుడిపాడు , ఆగిరిపల్లిలో నిర్వహించారు. డీపీఆర్‌టీయూ మండలశాఖ తరపున అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, వంశీ ధన్వవాదాలు తెలిపారు. అలాగే టీచర్లకు జనపనార సంచులను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శివనాగేంద్రం, ఇర్ఫాన్ బాషా, జిల్లా నాయకులు ఎన్ డేవిడ్ రాజు, గౌరవ అధ్యక్షులు బి.వి.ఎస్ లక్ష్మి, జిల్లా కార్యదర్శి నాగలక్ష్మి, మండల అసోసియేట్ అధ్యక్షులు యాలాద్రి, మహిళా కార్యదర్శి సుహాసిని పాల్గొన్నారు.

స్టూడెంట్స్ కిట్స్ పరిశీలన

ఆగిరిపల్లి, ఆగస్టు 3:ఆగిరిపల్లి మండలంలోని పాఠశాలలైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈదులగూడెం ఎంపీయూపీ స్కూల్ వడ్లమాను, ఆగిరిపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాలలను ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష టీం తనిఖీ చేశారు. ఈ టీమ్ ఏలూరు జిల్లా సమగ్రశిక్ష ఏఎస్‌ఎల్‌వో డాక్టర్ రాధాకృష్ణ, సహిత విద్యా కోఆర్డినేటర్ భాస్కర్‌రావు ఆయా పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులందరికి స్టూడెంట్స్ కిట్స్ అందాయో లేదో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల పనితీరు ఉపాధ్యాయులు పనితీరును పరిశీలించి నివేదిక తయారు చేశారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎంఈవో సర్వేశ్వరరావు, ఆనందరావు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సమావేశం

జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆగిరిపల్లిలో సాయంత్రం మూడు గంటలకు ఆగిరిపల్లి మండలం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈనెల 8న జరుగు పేరెంట్స్ కమిటీ ఎన్నికల గురించి ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికలను అందరూ ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తగా నియమ నిబంధనలను అనుసరించి జరపాలని ఎంఈవోలు ఆదేశించారు.

పూర్తిస్థాయిలో ఎస్‌ఎంసీ కమిటీలు ఏర్పడేనా...

ముదినేపల్లి, ఆగస్టు 3 : స్కూల్ మేనేజింగ్ కమిటీలు చాలా ప్రాథమిక పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఏర్పడే అవకాశాలు కనిపించటం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన సభ్యుల సంఖ్యకు లోబడి ఈ కమిటీలు ఏర్పడనున్నాయి. పది మంది విద్యార్థుల లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 15 మంది సభ్యులతో కూడిన కమిటీలు ఎన్నికయ్యే అవకాశమే లేదు. ముదినేపల్లి మండలంలో 13 మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలల్లో తక్కువ సంఖ్యలోనే ఎస్‌ఎంసీ కమిటీలు ఏర్పడనున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున 1 నుంచి 5వ తరగతి వరకు 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పడాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే మండలంలోని 12 పాఠశాలల్లో 10 మంది లోపు, ఒక పాఠశాలలో 11 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. తేరగూడెం పాఠశాలలో నలుగురు, నరసన్నపాలెంలో 8, బొమ్మినంపాడులో 6, పెదగొన్నూరులో 11, ఉప్పరగూడెంలో 7, ప్రొద్దువాక బొబ్బిలిగూడెంలో 9, వాడవల్లి బొబ్బిలిగూడెంలో 6, పెదకామనపూడిలో 6, ప్రొద్దుటూరులో 6, ప్రొద్దువాకలో -1లో 6, సీతారామపురంలో 4, ఊటుకూరులో 7, వడాలి -2 పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా, ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య వరకే కమిటీలు ఏర్పడనున్నాయి. అంటే పూర్తి స్థాయి కమిటీలు ఏర్పడే అవకాశాలు లేవు.

దొంగలను పట్టుకుంటాం: ఎస్‌ఐ

ముదినేపల్లి, ఆగస్టు 3 : ముదినేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ డి.వెంకట్ కుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ దొంగతనాలకు సంబంధించి అందిన ఫిర్యాదుల మేరకు 45 సీసీ ఫుటేజీలను పరిశీలించగా, కొన్ని సాక్ష్యాలు లభించాయని, పాత నేరస్థులు కదలికలను కూడా గమనిస్తున్నామని తెలిపారు. దొంగతనాలకు సంబంధించి 8 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. ట్రాక్టర్ల దమ్ము చక్రాలు, గొర్రెలు, గేదెలు, చెరువులపై విద్యుత్ మోటార్ల దొంగతనాలకు సంబంధించి ఫిర్యాదులు అందగా, దర్యాప్తు చేస్తున్నామని, వీటికి సంబంధించి లభించిన ఆధారాల ప్రకారం నిందితులను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రిపుల్ ఐటీ రెండో విడత కౌన్సెలింగ్ జాబితా

నూజివీడు టౌన్, ఆగస్టు 3: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ ఎంపిక జాబితాను శనివారం అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో జనరల్ కేటగిరికి సంబంధించిన ప్రవేశాలు పూర్తి కాగా మిగిలిన 753 సీట్లకు wwwrgukt.in వెబ్‌సైట్‌లో జాబితా ఉంచామన్నారు. ఆర్‌కె వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికైన వారికి ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో అదే విధంగా నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన వారికి నూజివీడు క్యాంపస్‌లో ఈనెల 9న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన మరో వారంలో విడుదల చేస్తామన్నారు. తరగతులు ఆగస్టు 21 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె


విజయవాడ కనకదుర్గమ్మకు ఆషాఢ సారె తీసుకు వెళుతున్న కైకలూరు షిర్డిసాయి సేవకులు

కైకలూరు, ఆగస్టు 3: విజయవాడ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా కైకలూరుకు చెందిన మహిళలు సారెను అందజేశారు. శనివారం కైకలూరు షిర్డీసాయి ధ్యానామందిరం సేవకులు సారెను అందజేశారు. ధ్యానమందిరం అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సారెను అందజేయగా శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయ అధికారులు స్వాగతం పలికి విశేష పూజలను నిర్వహించారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వేను పూర్తిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో పూర్ణచంద్రరావు

కైకలూరు ఆగస్టు 3: గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి నివేదిక అందజేయాలని ఏలూరు డీఎల్పీవో కె.పూర్ణ చంద్రరావు అన్నారు. శనివారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సమావేశాన్ని నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లపై జరుగుతున్న సర్వేపై రివ్యూ నిర్వహించగా పలు గ్రామాల్లో సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడంపై ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబునాయుడి వ్యక్తిగత మరుగుదొడ్లపై రివ్యూ సమావేశం నిర్వహించనున్నందున గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి మరుగుదొడ్లు లేనివారిని గుర్తించాలన్నారు. సోమవారం నాటికి ఈ సర్వేను పూర్తిస్థాయి మండలస్థాయి అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. అలాగే గ్రామ శివారు ప్రాంతాల్లో రక్షిత మంచినీరు పైప్‌లైన్ ద్వారా వచ్చే కుళాయి నీటిని పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే వాటర్లో క్లోరినేషన్, డ్రెయినేజీల క్లీనింగ్, పిచ్చి చెట్లు తొలగింపు తదితర వాటిని గ్రామాల్లో ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆర్ రవిశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కైకలూరు ఆగస్టు 3: లోకుముడి దత్తాశ్రమంలో నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టీ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ కోరారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి దత్తాశ్రమం, వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో అధునాతన పరికరాలతో షుగర్, బీపీ, రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, ఏకో వంటి పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేద్దాం


మాట్లాడుతున్న ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు

కలిదిండి, ఆగస్టు 3 : అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధి కారులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడి పిద్దామని ఎంపీపీ చందన ఉమ మహేశ్వరరావు అన్నారు. శనివారం కలిదిండి మండల పరిషత్ సర్వస భ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కా రానికి మైక్రో ఫిల్టర్ వాటర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాగునటి కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిబి కెనాల్‌కు గుడ్లవల్లేరు లాకుల వద్ద 702 క్యూసెక్కుల నీరు విడుదల చేయా లన్నారు. పోల్ రాజ్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో తాగునీరు విడుదల చేయకపో వటంతో చినతాడినాడలో అడుగంటిన తాగునీటి చెరువును ఇంత వరకు నింపకపోవటంతో ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆర్ అండ్ బి రహదారులు గోతులుపడి అధ్వానంగా ఉన్న ప్రదేశంలో మండల పరిషత్ నిధులతో రహదారుల మరమ్మ తులు చేయటానికి చర్యలు తీసుకుం టామన్నారు. చేపల, రొయ్యల చెరువులకు అనుమతులు మంజూరు చేసి విద్యుత్ సబ్సిడీ వర్తింపచేయాలన్నారు. సమావేశ ంలో జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కనకదుర్గా రాణి, కట్టా నాగలక్ష్మి, ఎంపీడీవో దినతేజ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు నిరసనగా ర్యాలీ


కలిదిండిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

కలిదిండి, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ శనివారం కలిదిండిలో జేఏసీ మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలంతా ఏకతాటి మీదకు వచ్చి వర్గీకరణ అంశాన్ని తిప్పి కొడతామన్నారు. వర్గీకరణ అంశాన్ని మళ్లీ పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ పోరాటానికి సిద్ధమన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కురేళ్ల ఏడుకొండలు, బళ్ల రాజు, యాళ్ల కృపారావు, మద్దిరాల జోగిబాబు, పంతగాని సురేష్, జాన్ రాజ్, ఈదా పద్మారావు, గరికిముక్కుల అశోక్‌లు పాల్గొన్నారు.

జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ చేయాలి

చాట్రాయి, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు కట్టుబడతాం, కానీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చెయ్యాలని నూజివీడు నియోజకవర్గ మాల మహానాడు నాయకుడు నక్కారాము డిమాండ్ చేశారు. విజయవాడ-సత్తుపల్లి రహదారిలో మండలంలోని సూరంపాలెం గ్రామంలో శనివారం మాల మహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మాదిగలు అధిక సంఖ్యలో ఉండగా, ఏపీలో మాలలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, జనాభా నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే ఏపీలో మెజార్టీ కులమైన మాలలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

హాస్టల్‌లో ఫ్యాన్లు ఏర్పాటు

నూజివీడు, ఆగస్టు 3:నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో గల శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి శనివారం సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. పుస్తకాలు పంపిణీ సందర్భంగా శుక్రవారం రాష్ట్రమంత్రి పార్థసారథి హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలు చెప్పిన సమస్యలలో ప్రధానంగా ఫ్యాన్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రహించిన మంత్రి పార్థసారథి తక్షణమే ఫ్యాన్లు అందించాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్ తనిఖీచేసి 24 గంటలు గడవకముందే బాలికల కష్టాలు తీర్చేందుకు ఫ్యాన్లు అందించడంతో బాలికలు, హాస్టల్ వార్డెన్ రాష్ట్రమంత్రి పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు.